సాక్షి హనుమకొండ

సోమవారం । 9 । జనవరి । 2023



ఒలింపిక్స్‌లో కబడ్డీని చేర్చాలి

విశేష ఆదరణ పొందుతున్న కబడ్డీ క్రీడను ఒలింపిక్స్‌లో చేర్చాలని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్‌యాదవ్ అన్నారు. - 8లో



సరికొత్త 'బడి'

సర్కారు బడులకు కొత్తరూపు కల్పించేందుకు ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కింద చేపట్టిన పనులు పూర్తయి ప్రారంభానికి నోచుకుంటున్నాయి. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 29.0°/13.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

12న మానుకోటకు సీఎం కేసీఆర్ రాక



సాక్షి, మహబూబాబాద్: సీఎం కేసీఆర్ మహబూబాబాద్ జిల్లా పర్యటన దాదాపు ఖరారైంది. రెండు నెలలుగా ఇప్పుడొస్తారు.. అప్పుడొస్తారని ఎదురు చూస్తున్న జిల్లా ప్రజల ఉత్కంఠకు తెరపడనుంది. ఈనెల 12న సీఎం జిల్లాలో పర్యటించి సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని అధికార పార్టీకి చెందిన జిల్లా నాయకులు పేర్కొన్నారు. జాతీయ రహదారి–365 పక్కనే కురవి రోడ్డులో 20 ఎకరాల స్థలంలో కలెక్టరేట్ నిర్మాణం పూర్తయింది.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొప్పుల



హన్మకొండ కల్చరల్: వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి ఆలయానికి చేరుకున్న మంత్రికి.. ఈఓ శేషుభారతి, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహా మండపంలో తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం అందజేసి అమ్మవారి శేష వస్త్రాలు, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, తాడిశెట్టి విద్యాసాగర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కరోనా టీకాలు

ఎంజీఎం: కోవాగ్జిన్ టీకాను జిల్లాలో సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొదటి, రెండో విడత, బూస్టర్ డోసు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కరోనా వ్యాక్సిన్ అన్ని పట్టణ సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ కోవిడ్ నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.


12 నుంచి లైబ్రరీ సైన్స్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో దూరవిద్య బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 12, 16, 18, 20, 23, 25, 27 తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో స్పెషల్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ఈ విద్యాసంవత్సరం 2022–23లో ప్రవేశాలకు అపరాధ రుసుముతో స్పెషల్ అడ్మిషన్లు ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై, జిల్లా కోఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందాలనుకునే ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలుగా ఉన్న ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ఫీజులను మీసేవ, టీఎస్ ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని, పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ ఓపెన్ స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

ఐలోనిలో భక్తుల సందడి



ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల సందడి ప్రారంభమైంది. వివిధ జిల్లాల నుంచి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో ఆరంభం కాగా.. నిత్య కైంకర్యాలు శైవ ఆగమ పద్ధతిలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో అర్ధ ప్రాణవట్టానికి భక్తులు పెద్ద సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు. కొందరు భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకుని వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మాతృభూమి.. సేవాస్మరామి!

ఎల్లలు దాటినా.. పురిటిగడ్డను మరువని ఎన్నారైలు

- ఏ దేశమేగినా సొంత మట్టిపై మమకారం
- సేవ కోసం భారీ విరాళాలు
- నేడు 'భారతీయ ప్రవాసి దివస్'



ఇక్కడ కష్టపడి చదివి ఆశలకు రెక్కలు తొడుక్కున్నారు. విమానమెక్కి వేలమైళ్లు ప్రయాణించారు. విరామమెరుగక విదేశాల్లో కొలువులు సాధించారు. ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడినా.. సొంత మట్టిపై మమకారాన్ని మరువలేదు. వారంతా సొంత ఊళ్లను స్మరిస్తున్నారు. మాతృభూమి సేవలో తరిస్తున్నారు. అందరూ బాగుండాలనే నినాదంతో ముందుకు సాగుతున్నారు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నారైలు. నేడు 'భారతీయ ప్రవాసి దివస్' సందర్భంగా ప్రత్యేక కథనం.

సేవా సంకల్పం..



గ్రామాభివృద్ధిపై స్థానికులతో చర్చిస్తున్న విడియాల సుధాకర్‌రావు



విడియాల సుధాకర్‌రావు దంపతులు

నల్లబెల్లి: నల్లబెల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ విడియాల గీత–సుధాకర్‌రావు దంపతులు అమెరికాలో ఫార్మసీ కంపెనీ నిర్వహిస్తున్నారు. సొంత గ్రామంపై ఉన్న మమకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతూ బాసటగా నిలుస్తున్నారు. గ్రామస్తుల కోరిక మేరకు రూ.1.50కోట్లతో ఫంక్షన్ హాల్ నిర్మించారు. 33 మంది నిరుపేదలకు రూ.500, ముగ్గురికి రూ.3వేల చొప్పున ప్రతీ నెల పెన్షన్ అందిస్తున్నారు. హైస్కూల్ అభివృద్ధి పనుల కోసం రూ.లక్ష, మహిళా సంఘాల బలోపేతానికి రూ.లక్ష, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.50వేల చొప్పున అందించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.30లక్షల విరాళం అందించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఏటా రూ.15వేల చొప్పున అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ అభివృద్ధి పనులకు రూ.10లక్షలు, అలాగే తాను చదువుకున్న ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగానికి రూ.కోటి విరాళంగా అందించి ప్రభుత్వ పెద్దల నుంచి అభినందనలు పొందారు.

జిల్లాపై మమకారం..



తల్లిదండ్రుల పేరు మీద మెమోరియల్ ఆస్పత్రి



నందకిశోర్, నందగోపాల్

కాటారం: మండలంలోని చిద్నెపల్లి పంచాయతీ బొప్పారం గ్రామానికి చెందిన ఊర నందకిశోర్, నందగోపాల్ సోదరులు విదేశాల్లో ఉంటూ సొంత జిల్లాపై మమకారాన్ని చాటుతున్నారు. నందకిశోర్ ముప్పై ఏళ్లుగా అమెరికాలో ఉంటూ సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. నందగోపాల్ వృత్తిరీత్యా వైద్యుడు. పదేళ్లపాటు లండన్‌లో వైద్యం అందించి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరి తల్లిదండ్రులు కమల మనోహర్‌రావు–సావిత్రిదేవి జ్ఞాపకార్థం జిల్లాలో సేవ చేస్తున్నారు. కాటారం ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి మూడెకరాల భూమి ఇచ్చారు. రెండేళ్ల క్రితం ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌కు వైద్య పరికరాల్ని అందించారు. దీంతో కాటారం ప్రభుత్వ ఆస్పత్రికి ఊర కమలమనోహర్‌రావు–సావిత్రి మెమోరియల్ ఆస్పత్రి అని ప్రభుత్వం నామకరణం చేసింది. జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో సుమారు రూ.40లక్షల విలువైన పది ఐసీయూ బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, ఇతర పరికరాలు అందించారు. తల్లిదండ్రుల స్మారకార్థం కాటారంలోని అభయాంజనేయస్వామి ఆలయానికి భూమి ఇచ్చారు. స్వగ్రామంలో సీతారాముల ఆలయం నిర్మించారు.

సమాజమంటే బాధ్యత..



తండ్రి ప్రవీణ్‌రావుతో కలిసి బాలుడికి చెక్కు అందజేస్తున్న శైలారావు

పెద్దవంగర: మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు–అరుంధతి దంపతుల సంతానం శైలరావు, ప్రణీత్‌రావు. వీరిద్దరూ అమెరికాలో సాఫ్ట్‌వేర్‌లుగా స్థిరపడ్డారు. తమ సంపాదనలో కొంత సమాజ సేవకు వెచ్చించాలని హైదరాబాద్ శివారు ప్రాంతంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సాయం అందించారు. నల్లగొండలో ఫ్లోరోసిస్ బాధితులకు ఆల్ ట్రూస్ సంస్థకు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేశారు. ఫ్లోరోసిస్ బారిన పడిన బాధిత బాలుడి కుటుంబానికి రూ.7లక్షలు విరాళాలు సేకరించి అందించారు. పెద్దవంగర మండలం రామచంద్రు తండాలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడు జాటోతు ప్రేమ్‌రాథోడ్‌కు ఆపరేషన్ నిమిత్తం గతేడాది అక్టోబర్‌లో ఎన్‌ఆర్‌ఐ నీలగిరి శృతి–రాఘవ్ సహకారంతో రూ.లక్ష, అమెరికాలో ఉంటున్న మిత్రులు, కుటుంబ సభ్యుల సహకారంతో రూ.లక్ష నగదు అందించారు. స్వగ్రామంలో అమ్మవారి ఆలయానికి రూ.12లక్షల సొంత నిధులు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. వికలాంగురాలికి త్రీవీల్స్ మోటార్ వెహికిల్ అందించారు. పేద మహిళల ఉపాధికి కుట్టుమిషన్లు, పేద విద్యార్థులకు తోడ్పాటు అందజేసి అక్కాతమ్ముడు ఔన్నత్యాన్ని చాటుతున్నారు.

'కేసరి' పేరుతో విద్యాభివృద్ధి



అప్‌గ్రేడ్ అయిన నేలపోగుల ప్రాథమికోన్నత పాఠశాల



కేసరి లక్ష్మీనారాయణ

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులకు చెందిన ఎన్నారై కేసరి లక్ష్మీనారాయణ అమెరికాలో కెమికల్ ఇంజనీరింగ్‌లో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. స్వగ్రామంలోని పాఠశాల అభివృద్ధికి ఎకరంన్నర స్థలం ఇచ్చారు. రూ.కోటితో నేలపోగుల ప్రాథమిక పాఠశాలను ఇంగ్లిష్ మీడియంలో మార్చి ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించారు. అందుకు రూ.20 లక్షలు ప్రభుత్వానికి చెల్లించారు. మరో రూ.10 లక్షలు హెడ్మాస్టర్ పేరుతో బ్యాంక్‌లో డిపాజిట్ చేసి పాఠశాల అవసరాలకు ఏడాదికి రూ.1.20 లక్షల ఆదాయం వచ్చేలా వనరులు సమకూర్చారు. మరో రూ.60 లక్షలతో పైఅంతస్తు నిర్మించి అందులో 20 కంప్యూటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణకు ట్యూటర్‌ను నియమించారు. ఏడాదికి రూ.2లక్షల సొంత ఖర్చులతో వైఫై, సీసీ కెమెరాలు, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి పాఠశాల పేరును తన భార్య రత్నమాల కేసరిగా మార్పు చేయించారు. గ్రామంలోని ఆలయాభివృద్ధికి మరో రూ.10లక్షలు కూడా కార్పస్ ఫండ్ జమ చేశారు.

పేబ్యాక్ టు సొసైటీ ని'నాదం'..



నాదం ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న దేవయ్య



డాక్టర్ పగిడిపాటి దేవయ్య

వరంగల్ క్రైం: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌కు చెందిన పగిడిపాటి దేవయ్య అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా గుర్తింపు పొందారు. పుట్టిన ఊరిపై మమకారంతో నేషనల్ అసోసియేషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ దళిత్, ఆదివాసీ, మైనార్టీ సంస్థ (నాదం) ద్వారా ఉన్నత చదువుల కోసం పేద విద్యార్థులకు ఊతమందిస్తున్నారు. స్కాలర్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వేలాది మంది విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఎంబీబీఎస్, ఐఐటీ సీట్లలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 'నాదం' ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనం..



టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న రాజ్‌కుమార్



కడుదుల రత్నాకర్



శానబోయిన రాజ్‌కుమార్

దుగ్గొండి: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన శానబోయిన రాజ్‌కుమార్ (తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ ఇండియా కోఆర్డినేటర్), వరంగల్‌కు చెందిన కడుదుల రత్నాకర్(తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ అధ్యక్షుడు), కరీంనగర్‌కు చెందిన అనిల్ కూర్మాచలం మిత్రులు. వీరంతా 14 ఏళ్ల క్రితం లండన్‌లోనే స్థిరపడ్డారు. పుట్టిన గడ్డను మరువకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2014 నుంచి వీరు దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం మండలాల్లో వందలాది ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థులకు నోట్ బుక్స్, పుస్తకాలు, షూలు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు. పాఠశాలల్లో ఫ్లోరైడ్ రహిత మంచినీటి కోసం ఆర్‌ఓ ప్లాంట్లను సొంత నిధులతో టీఏయూకే కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికే తాము ప్రాధాన్యం ఇస్తామని, తమ జీవిత చరమాంకం వరకు ప్రభుత్వ పాఠశాలలకు పునరుజ్జీవం కల్పించడానికి కృషి చేస్తామని కడుదుల రత్నాకర్, శానబోయిన రాజ్‌కుమార్ పేర్కొన్నారు. అనిల్, రత్నాకర్ లండన్‌లోనే ఉన్నా.. ఇక్కడికొచ్చి స్థిరపడిన రాజ్‌కుమార్ ద్వారా సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

పాఠశాలపై ప్రేమ..



విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న నిరంజన్‌రావు తండ్రి మోహన్‌రావు



అల్లమనేని నిరంజన్‌రావు

వర్ధన్నపేట: పట్టణానికి చెందిన అల్లమనేని నిరంజన్‌రావు అమెరికాలోని మిన్నోసోటా రాష్ట్రం ప్లైమౌత్ పట్టణంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డారు. తాను చదువుకున్న వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్‌లు, బ్యాగ్‌లు, దుస్తులు, క్రీడా వస్తువులు అందిస్తున్నారు. రెండు మూడేళ్లకోసారి తానే స్వయంగా వచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుండగా.. ప్రతీ సంవత్సరం తన తండ్రి మోహన్‌రావు, కుటుంబ సభ్యులు, స్నేహితుల ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

26 నుంచి 'హాత్ సే హాత్' యాత్ర

- డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర విజయవంతం కావడంతో దానికి కొనసాగింపుగా ఏఐసీసీ ఆదేశాలతో ఈనెల 26 నుంచి ప్రతీ నియోజకవర్గంలోని డివిజన్, గ్రామాల్లో 'హాత్ సే హాత్' పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో ఆదివారం యాత్రపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు నెలలపాటు కొనసాగనున్న హాత్ సే హాత్ యాత్రలో భాగంగా ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ప్రతీ బూత్, పంచాయతీలో ఇంటింటికీ ప్రచారం చేస్తూ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. అందులో భాగంగా ఈనెల 10న మండల కేంద్రాల్లో సమావేశం ఏర్పాటు చేసి.. రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని సూచించారు. పాదయాత్రలో రాహుల్‌గాంధీ సందేశాన్ని లేఖ ద్వారా, వీడియోలు, డోర్ స్టిక్కర్లను ఇంటింటికీ అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నాయకుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, కూచన రవళి, బంక సరళ, కూర వెంకట్, బొమ్మతి విక్రమ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి మార్గంలో పయనించాలి




రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స

హన్మకొండ కల్చరల్: లక్ష్య సాధనకు నేటి యువత వివేకానందుడి మార్గంలో పయనించాలని వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట అన్నారు. స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్కరించుకుని యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ సుబేదారి రెడ్‌క్రాస్ భవన్‌లో తలసేమియా బాధితుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా శ్రీవత్స కోట, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవత్స మాట్లాడుతూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ఫౌండేషన్ నిర్వాహకులు స్విమ్మర్ రాజు, కొత్తకొండ అరుణ్‌కుమార్‌లను అభినందించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, దేవనూరి ఆనంద్, కార్డియాలజిస్టు డాక్టర్ శ్రవణ్‌కుమార్, వెంకటేశ్, శ్రీనివాస్, రవికుమార్, ఫౌండేషన్ సభ్యులు కైలాసపు సంతోశ్, బొట్టు కమలాకర్, చెలిమెల అశోక్, గజ్జెల సుమన్, అలువాల పృథ్వీ, ఉప్పరపల్లి రాజు, జాన్సన్, రెడ్‌క్రాస్ డాక్టర్ కిషన్‌రావు పాల్గొన్నారు.

బదిలీల కోసం ఎదురుచూపులు

- ఐదేళ్లు దాటుతున్నా.. అదే స్థానంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు
- సీఐగా పదోన్నతి పొందినా.. ఎస్సైగానే కొనసాగింపు



కాజీపేట అర్బన్: ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం అందిస్తూ, ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తున్న ఎక్సైజ్ శాఖలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. మూడేళ్లకోసారి చేపట్టాల్సిన బదిలీలు ఐదేళ్లుగా చేపట్టకపోవడంతో ఒకే ఎక్సైజ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలగట్లేదు. ప్రభుత్వం ఎప్పుడు బదిలీల ప్రక్రియను ప్రకటిస్తుందా? అంటూ ఎదురు చూస్తున్నారు.

ఐదేళ్లుగా అదే స్థానంలో..

హనుమకొండ (వరంగల్‌అర్బన్) జిల్లాలో హనుమకొండ, కాజీపేట, వరంగల్ అర్బన్, ఖిలా వరంగల్ ఎక్సైజ్ కార్యాలయాల్లో నలుగురు ఇన్‌స్పెక్టర్లు ఐదేళ్ల క్రితం పోస్టింగ్ పొంది విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల జోన్‌ల విభజనలో భాగంగా.. కాజీపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జనగామ ఏఈఎస్‌గా పదోన్నతి పొందారు. హనుమకొండ, వరంగల్ అర్బన్, ఖిలా వరంగల్ ఎక్సైజ్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐలు ముగ్గురు, టాస్క్‌ఫోర్స్ సీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు జిల్లాలో ఆరుగురు సీఐలు ఐదేళ్లు దాటుతున్నా.. అదే ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

సీఐగా పదోన్నతి.. ఎస్సైగా కొనసాగింపు!

జోన్‌ల వారీ విభజనలో భాగంగా గతేడాది 28 మంది ఎస్సైలు సీఐలుగా పదోన్నతి పొందారు. కాగా.. బదిలీలు లేకపోవడంతో సీఐగా పదోన్నతి పొందినప్పటికీ అదే స్టేషన్‌లో ఎస్సైగానే కొనసాగుతున్నారు. తమకు పదోన్నతితోపాటు బదిలీలు కూడా చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

మారని తీరు..

ఐదేళ్లుగా అదే స్థానంలో సీఐ, ఎస్సైలున్నారు. వైన్స్, బార్లలో పెద్దగా మార్పేమీ లేదనే విమర్శలున్నాయి. బదిలీల్లో భాగంగా జిల్లాకు నూతన ఎక్సైజ్ సిబ్బంది వస్తే కొంత మార్పు వచ్చే అవకాశం ఉంది. కాగా.. కాజీపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఏఈఎస్‌గా పదోన్నతి పొంది జనగామకు బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ స్థానంలో మరో ఇన్‌స్పెక్టర్‌కు విధులు కేటాయించలేదు. దీంతో నేటికీ కాజీపేట ఎక్సైజ్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ స్థానం ఖాళీగానే ఉంది. ఎస్సై ఇన్‌చార్జ్ బాధ్యతలను కొనసాగిస్తున్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


క్రాంతి

సంగెం: వ్యక్తి అదృశ్యమైన సంఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోటవెంకటాపూర్ గ్రామానికి చెందిన చీకటి క్రాంతి(32) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామంలో, చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో క్రాంతి అన్న చీకటి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పెండ్యాల దేవేందర్ తెలిపారు. క్రాంతి వివరాలు తెలిస్తే 87126 85029, 87126 85243 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


మహేందర్ (ఫైల్)

మొగుళ్లపల్లి : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం నర్సింగాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేరుగు మహేందర్(45) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరుచూ గొడవకు దిగేవాడు. గొడవను దృష్టిలో పెట్టుకుని మహేందర్ కొడుకు నరేందర్ ఈ నెల 6వ తేదీ రాత్రి కిరాణం షాపు వద్ద నిలుచుని ఉన్న తండ్రిపై తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించాడు. గ్రామస్తులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మహేందర్ ఆదివారం మృతి చెందాడు. స్థానిక మహిళ ఇంగ్లీ శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హైనా దాడిలో దూడ..


హైనా దాడిలో మృతి చెందిన దూడ

బచ్చన్నపేట: వ్యవసాయ బావి వద్ద కట్టేసిన దూడపై హైనా దాడి చేసి చంపేసింది. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలింపూర్ గ్రామంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. బాధిత రైతు వివరాల ప్రకారం.. రైతు పోలెబోయిన ఉపేందర్ రోజు మాదిరిగానే తన వ్యవసాయ బావి వద్ద పశువులను కట్టేసి రాత్రి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసేసరికి దూడ మృతి చెంది కనిపించింది. హైనా దాడి చేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నెల రోజుల్లో పదిహేను దూడలను హైనా చంపిందని, రైతులు బావుల వద్దకు వెళ్లాలంటే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు హైనాను పట్టుకోవాలని ఎంపీటీసీ మహ్మద్ మసూద్ కోరారు.

సరికొత్త ‘బడి’

- ‘మన ఊరు-మన బడి’తో పాఠశాలలకు మహర్దశ
- ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలకు మోక్షం
- సకల సౌకర్యాలతో కార్పొరేట్ హంగులు


మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనులతో ముస్తాబైన హనుమకొండ లష్కర్‌బజార్ ప్రైమరీ స్కూల్

సాక్షిప్రతినిధి, వరంగల్: సర్కారు బడులకు కొత్త రూపు కల్పించేందుకు ప్రభుత్వం మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులు పూర్తయి ప్రారంభానికి నోచుకుంటున్నాయి. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో రూపుదిద్దుకున్న సర్కారు బడులు సరికొత్తగా తయారయ్యాయి. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమం కింద బడుల ఆధునీకరణతోపాటు మౌలిక వసతులు వేగంగా సమకూరుతున్నాయి. ప్రహరీ, అదనపు తరగతి గదులు, విశాలమైన డైనింగ్ హాళ్లు, కిచెన్ షెడ్లు, తలతలా మెరిసే టైల్స్‌తో వాషింగ్ ఏరియా, టాయిలెట్ల వంటి పనులు చేపట్టారు. అలాగే ఫర్నిచర్, తీరొక్క రంగులతో వేసిన పెయింటింగ్‌తో పాఠశాల గోడలు, ఆవరణలు అందంగా మెరిసేలా తీర్చిదిద్దగా.. ఏళ్లతరబడి పేరుకుపోయిన సమస్యలు తీరి విద్యాలయాలు నయా లుక్‌తో ఆకట్టుకుంటున్నాయి.

తొలిదశలో రూ.250కోట్లతో...

ఉమ్మడి వరంగల్‌లో తొలిదశలో రూ.250కోట్లతో 1,165 స్కూళ్ల ఆధునీకరణ పనులు చేపట్టగా.. పూర్తయిన 126 పాఠశాలలను మంత్రులు, ఎమ్మెల్యేల చేతులమీదుగా ఈ నెలలోనే ప్రారంభించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడున్న ప్రజాప్రతినిధులు ఈ నెలాఖరు నాటికి అన్నింటినీ ప్రారంభించే లక్ష్యంతో విద్యాశాఖ మార్గదర్శకాలను సూచించింది. ఆయా స్కూళ్లకు సంబంధించిన ఫర్నిచర్ టెండర్లు నెల రోజుల కిందటే పూర్తి కాగా, ఆ మేరకు ఆకుపచ్చ చాక్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, ఉపాధ్యాయులకు బల్లలు, కుర్చీలతోపాటు కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం ఫర్నిచర్ కూడా సరఫరా చేస్తున్నారు.

సర్కారు బడులకు కొత్త కళ..

ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయమైంది. మన ఊరు-మన బడితో సర్కారు బడులకు కొత్త కళ వస్తుంది. మా పాఠశాలలో కాంపౌండ్ వాల్, నీటి సంపు, విద్యుద్దీకరణ పనులకు నిధులు మంజూరు చేశారు. సంపు పనులను పూర్తి చేసి రంగులు వేశారు. ఈ కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్థాయి వచ్చింది. విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో చేరేందుకు అవకాశం ఉంది.

- ఎం.సంపత్, ఉపాధ్యాయుడు, ఎంపీపీఎస్, తరిగొప్పుల

ఒలింపిక్స్‌లో కబడ్డీని చేర్చాలి

- వరల్డ్ కబడ్డీ ఫెడరేషన్ టెక్నికల్ డైరెక్టర్ జగదీశ్వర్‌యాదవ్
- ఛాగల్లులో రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడల ఏర్పాట్ల పరిశీలన


ఛాగల్లులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌యాదవ్

స్టేషన్‌ఘన్‌పూర్: విశేష ఆదరణ పొందుతున్న కబడ్డీ క్రీడను ఒలింపిక్స్‌లో చేర్చాలని వరల్డ్ కబడ్డీ ఫెడరేషన్ టెక్నికల్ డైరెక్టర్, తెలంగాణ ఒలింపిక్స్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్ యాదవ్ అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లు గ్రామంలో కడియం ఫౌండేషన్ సహకారంతో స్వాగత్‌యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్ధం చేస్తున్న కబడ్డీ కోర్టులను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హనుమకొండలో జరుగుతున్న కబడ్డీ క్రీడోత్సవాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న నేను ఛాగల్లులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉన్నాయని తెలిసి కోర్టులను పరిశీలించినట్లు తెలిపారు. ఛాగల్లులో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ పూర్తి సహకారం ఉంటుందని, అవసరమైతే రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నుంచి మ్యాట్‌లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నర్సింగం, జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఛాగల్లు సర్పంచ్ పోగుల సారంగపాణి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ టెక్నికల్ బోర్డు కన్వీనర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ ప్రిన్సిపాల్‌పై బదిలీ వేటు

కమలాపూర్: కమలాపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పింగిలి వెంకటరమణారెడ్డిపై బదిలీ వేటు పడింది. పదో విద్యార్థి విష్ణుపై సెల్ ఫోన్ దొంగతనం మోపి చితకబాదిన ఘటనలో వరంగల్ జిల్లా గురుకుల పాఠశాలల డీసీఓ మనోహర్‌రెడ్డి విచారణ జరిపి అందజేసిన నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్ వెంకటరమణారెడ్డిని తక్షణమే బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురుకులాల కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు ఈ నెల 7న బదిలీ ఉత్తర్వులు జారీ చేసినట్లు వరంగల్ జిల్లా గురుకుల పాఠశాలల డీసీఓ వై.మనోహర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కాగా, వెంకటరమణారెడ్డిని మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి, దంతాలపల్లిలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఒ.మల్లయ్యను కమలాపూర్‌కు బదిలీ చేస్తూ గురుకులాల కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం

డోర్నకల్: గుండ్రాతిమడుగు–డోర్నకల్ రైల్వేస్టేషన్ల మధ్య కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించినట్లు డోర్నకల్ జీఆర్పీ ఎస్సై శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. డౌన్‌లైన్‌లో చెట్ల పొదల్లో కుళ్లినస్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి.. మృతదేహం వద్ద లభించిన ఆధార్, లేబర్ ఎంప్లాయిమెంట్ కార్డులోని వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం డెవోరియా జిల్లా సాలెంపూర్ శివారు కుంకుండు గ్రామానికి చెందిన సాగర్‌కుమార్(26)గా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. సుమారు 30 రోజుల క్రితం గుర్తు తెలియని రైలు నుంచి చెట్లపొదల్లో జారి పడి మృతి చెంది ఉండవచ్చని చెప్పారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని, ఖమ్మంకు చెందిన అన్నం ఫౌండేషన్ ప్రతినిధి అన్నం శ్రీనివాస్ తన సిబ్బందితో మృతదేహాన్ని ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తరలించారని వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ వెల్లడించారు.

సైబర్ వలలో విలవిల

- రూ.7లక్షలు పోగొట్టుకున్న ముగ్గురు

కాజీపేట: ఆన్‌లైన్‌లో పరిచయమైన వారిని గుడ్డిగా నమ్మిన ముగ్గురు వ్యక్తులు రూ.7 లక్షలు మోసపోయారు. ఈ మేరకు ఆదివారం రాత్రి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చైతన్యపురి కాలనీకి చెందిన యువకుడు ఉద్యోగం వెతుకుతూ రూ.1.20 లక్షలు, ఫాతిమానగర్ కాలనీకి మరో వ్యక్తి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశపడి రూ.40వేలు, సోమిడికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో పరిచయమైన ఫ్రెండ్ మాటలు నమ్మి రూ.5.40 లక్షలను సైబర్ నేరగాళ్లకు సమర్పించుకుంది. మోసపోయినట్లు తెలుసుకుని ముగ్గురు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

- తొమ్మిది మంది అరెస్ట్

భూపాలపల్లి రూరల్: కోడి పందేలు ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి సీఐ రాజిరెడ్డి తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి కేటీకే -1 గని పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఏఎస్సై సాంబయ్య తన సిబ్బందితో దాడులు చేశారు. ఈ క్రమంలో కోడి పందేలు నిర్వహిస్తూ 9 మంది పట్టుబడ్డారు. రెండు కోడి పుంజులు, రూ.1,200నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

అదుపుతప్పి బోల్తాపడిన లారీ


మైలారం శివారులో బోల్తాపడిన లారీ

రాయపర్తి: అదుపు తప్పి లారీ బోల్తాపడిన సంఘటన మండలంలోని మైలారం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తొర్రూరు వైపు నుంచి వస్తున్న లారీ ఒక్కసారిగా అదుపుతప్పడంతో తలకిందులుగా బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలై బయటపడినట్లు తెలిపారు.

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు


జవాన్ రమేష్ అంతిమయాత్ర


రమేష్ భౌతికకాయం వద్ద రోదిస్తున్న భార్యాపిల్లలు

గార్ల: అరుణాచల్‌ప్రదేశ్ గువాహటి సమీపంలో ట్రక్కు బోల్తాపడి లోయలో పడిన ఘటనలో మృతి చెందిన జవాన్ భూక్యా రమేష్ అంత్యక్రియలు ఐటీబీపీ అధికార లాంఛనాలతో ఆదివారం పీక్లీతండాలో ముగిశాయి. తొలుత రమేష్ అంతిమయాత్ర గార్ల నెహ్రూసెంటర్ నుంచి జనసందోహం మధ్య పీక్లీతండా వరకు 4 కిలోమీటర్ల మేర కొనసాగింది. కాసేపు మృతుడి నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. మృతుడి భౌతికకాయంపై భార్య రేణుక, ముగ్గురు పిల్లలు పడి రోదించడం పలువురు కంటతడి పెట్టించింది. చుట్టుప్రక్కల గ్రామస్తులు, బంధువులు రమేష్ మృతదేహం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం ఊరేగింపుగా శ్మశానవాటికకు తీసుకెళ్లారు. అక్కడ విశాఖపట్నం నుంచి వచ్చిన ఇండో టిబెటిన్ బార్డర్ పోలీస్ బెటాలియన్ సిబ్బంది కవాతు నిర్వహించి రెండు రౌండ్లను గాలిలోకి కాల్చారు. మృతుడి కుమారుడు చితికి నిప్పటించాడు. గార్ల, బయ్యారం సీఐ బాలాజీ, ఎస్సై బానోత్ రమేష్, ఎంపీపీ శివాజీచౌహాన్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, వైఎస్సార్‌టీపీ జిల్లా పార్లమెంట్ కన్వీనర్ బానోత్ సుజాత మంగీలాల్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ గేమింగ్

- ఉరి వేసుకొని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


నజీర్‌గౌడ్ (ఫైల్)

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బైరగోని నజీర్‌గౌడ్(21) అనే బీటెక్ విద్యార్థి ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బైరగోని సత్యనారాయణ – పద్మ దంపతుల చిన్న కుమారుడు నజీర్‌గౌడ్ యశ్వంతాపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లిన అతడు చదువుకోవాలని చెప్పి మధ్యలోనే ఇంటికి వచ్చాడు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చే సరికి నజీర్‌గౌడ్ ఉరి వేసుకుని కనిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా ఆన్‌లైన్ గేమ్‌కు బానిసై పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ గేమ్ నిర్వాహకుల మూలంగా ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

ఆర్థిక సమస్యలతో గుమస్తా ఆత్మహత్య

కాశిబుగ్గ: ఆర్థిక సమస్యలు తాళలేక ఓ గుమస్తా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య అండర్ బ్రిడ్జి సమీపంలో అదివారం చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ ఎస్సై పరుశరాములు తెలిసిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మొగిలిచర్ల కాపువాడకు చెందిన అల్లం రమేష్(45) నగరంలోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఓ అడ్తి షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. రమేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈనేపథ్యంలో ఆర్థిక సమస్యలతో కుటుంబంలో గొడవలు జరిగి జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం ఇంటి నుంచి రమేష్ బయటకు వచ్చాడు. అండర్ బ్రిడ్జి సమీపంలోని వరంగల్ రైల్వే స్టేషన్ యార్డు సిగ్నల్ పాయింట్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో ఆయన రెండు ముక్కలై అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు, చేసి మృతదేహనికి ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

రైలుకిందపడి ఒకరు..

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కాజీపేట–పెండ్యాల రైల్వేస్టేషన్ల మధ్య గల అయోధ్యపురం రైల్వేగేట్ సమీపంలో ఓ వ్యక్తి ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. కాజీపేట జీఆర్పీ ఎస్సై అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన రాపాక శ్రీనివాస్(45) టైలర్ వృత్తి చేస్తున్నాడు. కొంతకాలంగా అతడి మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూ కబ్జా

- పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి

హసన్‌పర్తి: గ్రేటర్ వరంగల్ పరిధి చింతగట్టులో ఓ వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూ కబ్జాకు పాల్పడుతున్నాడని హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చింతగట్టుకు చెందిన జగన్నాథరెడ్డి 50 ఏళ్ల క్రితం తనకు సంబంధించిన భూములు విక్రయించాడని తెలిపారు. కొనుగోలుదారులు ఇప్పటికే అట్టి భూముల్లో ప్లాట్లు చేసి విక్రయాలు జరిపారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ భూములపై ఇదే ప్రాంతానికి చెందిన బిల్లా రవీందర్‌రెడ్డి కన్నుపడిందని, జగన్నాథరెడ్డి తన తాత అంటూ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూ కబ్జాకు పాల్పడి మళ్లీ విక్రయాలు చేపట్టాడని ఆరోపించారు. ఈ మేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారని, విషయాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయమై నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, నాయకులు మల్లేశం, కమలాకర్, సాగర్ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. ముగ్గురికి గాయాలు


ధ్వంసమైన కారు

దామెర: రెండు కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా భూపాలపట్నంకు చెందిన చటి మురుగేష్ తన కుటుంబ సభ్యులతో హనుమకొండ వైపునకు వెళ్తున్నాడు. ఒగ్లాపూర్ సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు రాగానే హనుమకొండ నుంచి ములుగు వైపునకు వెళ్తున్న కారు మురుగేష్ కారును ఎదురుగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న మురుగేష్‌తో పాటు మరో ఇద్దరు మహిళలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై అనిల్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విద్యార్థులకు వేర్వేరు భోజనంపై ప్రశ్నించిన తండ్రి



తరిగొప్పుల: సేవా భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జనగామ జిల్లా తరిగొప్పుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు భవిష్యత్ కార్యాచరణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే మాంసాహారం వడ్డించారు. బీసీ విద్యార్థులకు యథావిధిగా మధ్యాహ్న భోజనం పెట్టారు. దీంతో బీసీ విద్యార్థులు అసహనానికి గురయ్యారు. కాగా, ఈ విషయాన్ని విద్యార్థుల తమ తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో వాట్సాప్‌లో ఓ విద్యార్థి తండ్రి సదరు పాఠశాల హెచ్‌ఎంను ప్రశ్నించగా ఎలాంటి సమాధానం రాలేదు. అలాగే, మండల విద్యాశాఖ అధికారిని ఫోన్‌లో సంప్రదించగా లిఫ్ట్ చేయలేదని సదరు విద్యార్థి తండ్రి వాపోయాడు.

సీసీఎంబీ వైఐపీకి సాయిలేఖ్య

- ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన కంబాలపల్లి విద్యార్థిని
- శాస్త్రవేత్తలతో మమేకమయ్యే సువర్ణావకాశం


సీసీఎంబీ డైరెక్టర్‌తో సాయిలేఖ్య

విద్యారణ్యపురి: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ఎంతకైనా ఎదుగుతారనే దానికి ఇదో నిదర్శనం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ మండలం కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇందుర్తి సాయిలేఖ్య హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాల్‌క్యులర్ బయాలజీ(సీసీఎంబీ) యంగ్ ఇన్నోవేటర్ ప్రోగ్రాం (వైఐపీ) కార్యక్రమానికి ఎంపికైంది. ఈ మేరకు ఈనెల 4 నుంచి 13 వరకు సీసీఎంబీలో నిర్వహిస్తున్న వైఐపీ–2023లో పాల్గొంటుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎంపికైన ఏకైక బాలిక ఇందుర్తి సాయిలేఖ్య కావడం విశేషం. పాఠశాల ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ వి.గురునాథరావు శాస్త్రీయ ప్రక్రియలపై శిక్షణ ఇచ్చి సాయిలేఖ్యను ప్రోత్సహించారు.

విద్యార్థులను ప్రోత్సహించేలా..

8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల్లో ప్రతిభావంతులను గుర్తించడానికి సీసీఎంబీ వైఐపీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల ద్వారా నామినేట్ చేసిన విద్యార్థులకు ఎంపిక పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారిలో 20 నుంచి 25 మందిని సీసీఎంబీలో సుమారు రెండువారాల పాటు పరిశోధనా అనుభవం కోసం ఎంపిక చేస్తారు. కాగా, డిసెంబర్ 26న సీసీఎంబీలో వైఐపీకి కోసం ఎంపిక పరీక్ష నిర్వహించగా కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు హాజరయ్యారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్, ఇతర పాఠశాలలకు చెందిన 243 మంది విద్యార్థులు హాజరైన ఈ పరీక్షలో సాయిలేఖ్య ప్రతిభ కనబరిచింది. ఎంపికైన 26 మందిలో సాయిలేఖ్య కూడా ఉండడం విశేషం.

4 నుంచి ప్రవేశం..

సీసీఎంబీ వైఐపీ ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 4నుంచి ప్రవేశం కల్పించారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యార్థులు సైంటిస్టులతో కలిసి ప్రయోగశాలల్లో ఉండాలి. పరిశోధనలు చేసే అంశాల గురించి తెలుసుకోవాలి. సాయిలేఖ్య స్వస్థలం కంబాలపెల్లి కావడంతో గైడ్ టీచర్ గురునాథరావు సీసీఎంబీ డైరెక్టర్‌కు లేఖ రాశారు. సీసీఎంబీలోనే ఉండే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన డైరెక్టర్ వినయ్ కె నందికూరి సీసీఎంబీ గెస్ట్‌హౌస్‌లో ఉండేలా సాయిలేఖ్యతోపాటు ఆమె తల్లికి అవకాశం కల్పించారు. కాగా, ఎంపికైన విద్యార్థులు డీఎన్‌ఏ తయారీ, విశ్లేషణ, నానోకణాల తయారీ, పరీక్ష, బాక్టీరియాను పెంచడం, లెక్కించడం, డ్రోసోఫిలా, జీబ్రాఫిష్‌లలో అభివృద్ధి ప్రక్రియను గమనించడం వంటి ప్రయోగాలు నిర్వహిస్తారు. అలాగే సైంటిస్టుల పరిశోధనలు, వాటికి సంబంధించిన అంశాలను కూడా చూసే అవకాశం ఉంది. వైఐపీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ కూడా అందిస్తారు.

గొప్ప అవకాశం



సీసీఎంబి వైఐపీ ప్రోగ్రాంకు ఎంపికై సీసీఎంబీలో ఉంటున్నాను. సైంటిస్టులతో కలిసి శాస్త్రీయ ప్రక్రియలు తెలుసుకునే అవకాశం కలగడం గొప్ప అవకాశం. శాస్త్రవేత్తలను రోజూ కలుస్తున్నా. వారు కొత్త కొత్త విషయాలు చెబుతున్నారు. సందేహాలను నివృత్తి చేస్తూ పలు విషయాలను మరింత ఆసక్తికరంగా వివరిస్తున్నారు. భవిష్యత్‌లో సైన్స్‌పై ఇంకా ఆసక్తిని కలిగించేలా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

- సాయిలేఖ్య, కంబాలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని

కార్పొరేట్‌కు తక్కువ కాదని నిరూపించింది..



ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు కార్పొరేట్ సంస్థల విద్యార్థులకు తక్కువేమి కాదని సాయిలేఖ్య నిరూపించింది. సీసీఎంబీలో శాస్త్రవేత్తలను కలిసి సంభాషించే అవకాశం రావడం సువర్ణ అవకాశం. పరిశోధనలను దగ్గరి నుంచి చూసి వాటి గురించి తెలుసుకునే వీలు కలిగింది.

- డాక్టర్ వి.గురునాథరావు, గైడ్ టీచర్